చంద్రుడిపై రయ్ రయ్‌మంటూ..

టోక్యో, సెప్టెంబర్ 20: చంద్రుడిపై పరిశోధనలు మరింత వేగం పుంజుకోనున్నాయి. ఇప్పటివరకు చంద్రుడిపై ల్యాండ్ అయిన చోటనే పరిశోధనలకు వీలుండేది. ఇప్పుడు ల్యాండ్ అయిన చోట నుంచి వ్యోమగాములు కొంత దూరం ప్రయాణం చేయడానికి వీలుగా ఒక ప్రెషరైజ్డ్ రోవన్‌ను జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం టయోటా కంపెనీ తయారు చేస్తున్నది. నాసా చేపట్టనున్న అర్టెమిస్ 7 మిషన్ కోసం ఈ రోవన్‌ను వినియోగించనున్నారు. టైర్లతో కూడిన ఈ రోవర్(వాహనం)లో వ్యోమగాములు చంద్రుడిపై ఒక చోట నుంచి మరో చోటకు ప్రయాణించవచ్చు. ఇందులోనే కొంతకాలం నివసించవచ్చు. చంద్రుడిపై అధ్యయనం జరపడానికి అవసరమైన శాస్త్రీయ పరికరాలు కూడా ఇందులో ఉంటాయి. ఒకరకంగా చెప్పాలంటే ఇది కారవాన్, మొబైల్ ల్యాబ్ కలగలిసిన వాహనం. చంద్రుడిపై ప్రతికూల వాతావరణం, రేడియేషన్ ప్రభావం వ్యోమగాములపై పడకుండా దీనిని రూపొందిస్తున్నారు. ఈ రోవర్ తయారీ కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ(జేఏఎక్స్‌ఏ) కలిసి పని చేస్తున్నాయి.

ఎముకల క్యాన్సర్‌కు గాలియంతో చెక్!

లండన్, సెప్టెంబర్ 20: ఎముకల క్యాన్సర్(ఆస్టియోసార్కోమా)కు ఇంగ్లండ్‌కు చెందిన పరిశోధకులు కొత్త చికిత్స విధానాన్ని అభివృద్ధి చేశారు. గాలియం అనే మూలకం ద్వారా క్యాన్సర్ కణాలను 99 శాతం కచ్చితత్వంతో అంతం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు ఆస్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం జరిపిన ప్రయోగంలో మంచి ఫలితాలు వచ్చాయి. ఎముకలు, దంతాల దృఢత్వాన్ని పెంచే సామర్థ్యం కలిగిన బయోయాక్టివ్ అద్దాలను పొడిగా మార్చి, దానికి గాలియంను కలిపి చికిత్సకు ఉపయోగించవచ్చని ఈ ప్రయోగానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ రిచర్డ్ మార్టిన్ తెలిపారు. ఆకలితో ఉండే క్యాన్సర్ కణాలు ఈ మిశ్రమంతో మరణిస్తాయని చెప్పారు.క్యాన్సర్ కారణంగా నష్టం జరిగిన ఎముక మళ్లీ ఏర్పడేందుకు సైతం ఇది ఉపయోగపడుతుందని అన్నారు. ఆస్టియోసార్కోమా బాధితులకు కీమోథెరపీ, సర్జరీ చేసినప్పటికీ వ్యాధి నుంచి కోలుకునే అవకాశాలు పెరగడం లేదు. దీంతో ఈ కొత్త చికిత్స విధానం ఆశాజనకంగా మారింది. త్వరలోనే దీనికి సంబంధించి ట్రయల్స్ నిర్వహిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు.

కదులుతున్న కారులో
దళిత బాలికపై గ్యాంగ్ రేప్
యూపీలో దారుణం

మథుర, సెప్టెంబర్ 20: కదులుతున్న కారులో ముగ్గురు వ్యక్తులు ఒక దళిత బాలిక(13)పై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఎస్పీ(గ్రామీణ) త్రిగుణ్ బైసెన్ కథనం ప్రకారం అల్పాహారానికి కావాల్సిన సరకులు కొనడానికి గురువారం బాలిక ఇంటి పక్కన ఉన్న దుకాణానికి వెళ్లింది. అక్కడ నీరజ్ అనే వ్యక్తి ఆమెకు మత్తు మందు కలిపిన నీళ్లు తాగడానికి ఇచ్చాడు. ఆ తర్వాత బాలిక మైకంతో పడిపోగానే ఆమెను నీరజ్, అతడి సహచరుడు కారులో తీసుకెళ్లి లైంగిక దాడి చేసి ఆమెను బర్సానా రోడ్‌లోని ఫ్లైఓవర్ కింద పడేశారు.

నిజ నిర్ధారణ యూనిట్‌కు చెక్!

- కేంద్ర ప్రభుత్వానికి బొంబాయి హైకోర్టు షాక్
- ఐటీ చట్టానికి చేసిన సవరణలను కొట్టివేసిన న్యాయస్థానం
- ఆన్‌లైన్ వార్తలను తొక్కి పెట్టాలనుకున్న కేంద్రానికి చుక్కెదురు

ముంబై: ఆన్‌లైన్‌లో వచ్చే ఫేక్ న్యూస్‌ను గుర్తించేందుకు ఫ్యాక్ట్ చెక్ (నిజ నిర్ధారణ) యూనిట్‌లను ఏర్పాటు చేయాలనుకున్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నానికి బొంబాయి హైకోర్టు చెక్ పెట్టింది. కేంద్ర ప్రభుత్వం ఐటీ చట్టానికి చేసిన సవరణలను కొట్టివేసింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 19కి విరుద్ధమని జస్టిస్ ఏఎస్ చందూర్కర్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సవరణ నిబంధనలు, 2023 ప్రకారం ఆన్‌లైన్‌లో వచ్చే బోగస్ న్యూస్‌ను గుర్తించేందుకు కేంద్రం నిజ నిర్ధారణ యూనిట్‌లను ఏర్పాటు చేయవచ్చు. ఈ అంశాన్ని అత్యంత క్షుణ్ణంగా పరిశీలించానని, ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 19 (భావ ప్రకటన స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం), ఆర్టికల్ 19 (1)(జీ) (వృత్తి స్వేచ్ఛ, హక్కు)ను ఉల్లంఘించేవిగా ఉన్నాయని జస్టిస్ చందూర్కర్ పేర్కొన్నారు. ఐటీ నిబంధనల్లోని 'బోగస్, తప్పుడు, తప్పుదోవ పట్టించే' అనే మాటలకు ఎటువంటి నిర్వచనం లేని నేపథ్యంలో అవి అస్పష్టంగాను, తప్పుగాను ఉన్నాయన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన బొంబాయి హైకోర్టు ధర్మాసనం ఈ ఏడాది జనవరిలో భిన్నమైన తీర్పునిచ్చింది. దీంతో కేసు మూడో న్యాయమూర్తి వద్దకు వచ్చింది. ఐటీ చట్టాన్ని సవరిస్తూ కేంద్రం ప్రతిపాదించిన నిబంధనలు వార్తలపై సెన్సార్ విధించేలా ఉన్నాయని జస్టిస్ పటేల్ పేర్కొనగా, ఆ నిబంధనల వల్ల వాక్ స్వాతంత్ర్యానికి వచ్చిన నష్టమేమీ లేదని జస్టిస్ గోఖలే అన్నారు. దీంతో జస్టిస్ చందూర్కర్ వచ్చిన ఈ కేసులో ఆయన శుక్రవారం తుది తీర్పునిచ్చారు.

వాక్ స్వాతంత్ర్యంపై ఆంక్షలు

కేంద్రం ప్రతిపాదించిన నిబంధనల వల్ల భావప్రకటనా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యంపై అకారణంగా ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని కమెడియన్ కునాల్ కామ్రాతో పాటు మరికొందరు పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ వార్తలపై ప్రభుత్వం సెన్సార్ విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ వార్తలకు ప్రభుత్వమే 'ప్రాసిక్యూటర్‌గా, జడ్జిగా, తీర్పును అమలుచేసే అధికారి'గా వ్యవహరించే అధికారం ఈ నిబంధనల వల్ల లభిస్తుందని పేర్కొన్నారు.

పేజర్ పేలుళ్లకు కేరళ లింకు!

న్యూఢిల్లీ: లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల సంఘటనలో కేరళ వ్యక్తి రిన్‌సన్ జోస్ (37) ప్రమేయంపై దర్యాప్తు జరుగుతున్నది. ఆయన కేరళలోని వయనాడ్‌కు చెందినవారు. ప్రస్తుతం నార్వేజియన్ పౌరుడు. ఆయన బల్గేరియన్ కంపెనీ నోర్టా గ్లోబల్ లిమిటెడ్‌కు ఏకైక యజమానిగా రికార్డులు చెప్తున్నాయి. హెజ్బొల్లా ఉగ్రవాదులపై దాడుల్లో ఉపయోగించిన పేజర్లను సరఫరా చేసిన కంపెనీ ఇదే. దీనిపై బల్గేరియా దర్యాప్తు చేస్తున్నది. వయనాడ్ డిప్యూటీ ఎస్పీ (స్పెషల్ బ్రాంచ్) పీఎల్ షిజు మాట్లాడుతూ, లెబనాన్ పేలుళ్లలో రిన్‌సన్ ప్రమేయంపై వార్తలు వచ్చిన తర్వాత ఆయన గురించి సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. లెబనాన్ వ్యాప్తంగా జరిగిన పేజర్ల పేలుళ్లలో 12 మంది మరణించగా, సుమారు 3,000 మంది గాయపడిన సంగతి తెలిసిందే. రిన్‌సన్ పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చేశారు. ఓస్లో మెట్రోపాలిటన్ విశ్వవిద్యాలయంలో సోషల్ వెల్ఫేర్ అండ్ హెల్త్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ చేశారు.

యుద్ధం అంచున ఇజ్రాయెల్ -లెబనాన్

- పేజర్ల పేలుళ్ల తో ఉద్రిక్తతలు తీవ్రం
- ప్రతిదాడి తప్పదన్న హెజ్బొల్లా
- ఇజ్రాయెల్‌పైకి రాకెట్ల వర్షం
- బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి
- హెజ్బొల్లా టాప్ కమాండర్ ఇబ్రహీం సహా 8 మంది మృతి

జెరూసలేం, సెప్టెంబర్ 20: ఇజ్రాయెల్ – లెబనాన్ సరిహద్దుల్లో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. హెజ్బొల్లా లక్ష్యంగా లెబనాన్‌లో జరిగిన పేజర్లు, వాకీటాకీల పేలుళ్లతో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ పేలుళ్లు ఇజ్రాయెల్ పనేనని ఆరోపించిన హెజ్బొల్లా ప్రతిదాడులు తప్పవని హెచ్చరించిన తర్వాత పరిస్థితి మరింత క్షీణించింది. హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకుంటూ లెబనాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణులతో దాడులకు దిగింది. మరోవైపు హెజ్బొల్లా సైతం ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం కురిపించింది. ఒకవైపు గాజాలో ఇజ్రాయెల్ – హమాస్ మధ్య యుద్ధం ముగుస్తుందని అంతా భావిస్తున్న తరుణంలో ఇజ్రాయెల్ – హెజ్బొల్లా మధ్య యుద్ధ పరిస్థితులు తలెత్తడం ఆందోళనకరంగా మారింది.

పరస్పరం దాడులు

లెబనాన్ రాజధాని బీరుట్‌పై గురువారం నుంచి ఇజ్రాయెల్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్నది. దక్షిణ బీరుట్‌లోని జేమస్ స్ట్రీట్ ప్రాంతంలో ఓ భవనంపై జరిగిన దాడిలో అనేక మంది గాయపడ్డారు. క్ఫర్ కిలా పట్టణంలోని హెజ్బొల్లా శిబిరంపైనా దాడి చేసింది. ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా టాప్ కమాండర్ ఇబ్రహీం అఖిల్ సహా ఎనిమిది మంది మరణించారని, 59 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై శుక్రవారం 140 కత్యూషా రాకెట్లతో దాడి చేసినట్టు హెజ్బొల్లా ప్రకటించింది. ఇజ్రాయెల్ వాయు రక్షణ కేంద్రాలతో పాటు సైనిక బ్రిగేడ్ కేంద్రంపై దాడి చేసినట్టు చెప్పింది. గోలన్ హైట్స్, సఫేద్, అప్పర్ గలిలీ ప్రాంతంలో హెజ్బొల్లా దాడి చేసినట్టు ఇజ్రాయెల్ నిర్ధారించింది. ఈ పరస్పర దాడుల్లో ఇరువైపులా భారీగానే ఆస్తినష్టం జరిగిందని, పదుల సంఖ్యలో గాయపడ్డారని స్థానిక మీడియా సంస్థలు పేర్కొన్నాయి.

యుద్ధం తప్పదు: ఇజ్రాయెల్

అక్టోబరు 8 నుంచి ఇజ్రాయెల్ – హెజ్బొల్లా మధ్య దాడులు జరుగుతున్నప్పటికీ ఇప్పుడు యుద్ధం అంచుకు చేరాయి. పేజర్ల పేలుడు ఇజ్రాయెల్ చేసిన యుద్ధ ప్రకటనే అని హెజ్బొల్లా సెక్రటరీ జనరల్ హస్సన్ నస్రల్లా వ్యాఖ్యానించగా, ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన ప్రజలను తిరిగి వారి ఇండ్లకు చేర్చేందుకు యుద్ధం తప్పదని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జాగ్ వ్యాఖ్యానించడం యుద్ధానికి ఇరువైపులా సిద్ధమవుతున్నట్టు కనిపిస్తున్నది. గాజా నుంచి పెద్ద ఎత్తున సైనికులను లెబనాన్ సరిహద్దు వైపు ఇజ్రాయెల్ మోహరిస్తున్నది. హెజ్బొల్లా కూడా యుద్ధానికి సన్నద్ధమవుతున్నది. గోలన్ హైట్స్, ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతాల్లో గుమిగూడొద్దని, సురక్షిత ప్రాంతాలకు చేరువగా ఉండాలని ప్రజలకు ఇజ్రాయెల్ సూచించింది.

బీరుట్‌లో ఇజ్రాయెల్ దాడి వల్ల దెబ్బ తిన్న ఓ భవనాన్ని పరిశీలిస్తున్న ప్రజలు

బార్ ఎగ్జామ్‌కు
ఎల్ఎల్‌బీ ఫైనలియర్ విద్యార్థులకు అనుమతి

న్యూఢిల్లీ: ఆలిండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబీఈ)ని రాసేందుకు ఎల్ఎల్‌బీ ఫైనలియర్ విద్యార్థులను ఈ ఏడాది అనుమతించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ని సుప్రీం కోర్టు శుక్రవారం ఆదేశించింది. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 2023లో ఈ అంశంపై ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఏఐబీఈ నిబంధనలను బీసీఐ రూపొందించలేదని తెలుసుకుని ధర్మాసనం అవాక్కయింది. 9 మంది విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈ పరీక్ష నవంబరు 24న జరుగుతుంది.

శ్రీలంక సారథి ఎవరు?
అధ్యక్ష పదవికి నేడు ఎన్నిక

కొలంబో, సెప్టెంబర్ 20: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంకలో శనివారం దేశాధ్యక్ష పదవికి ఎన్నిక జరగనుంది. మొత్తం 38 మంది అభ్యర్థులు ఈ ఎన్నికలో పోటీ పడుతున్నారు. దాదాపు 1.70 కోట్ల మంది ప్రజలు నేరుగా ఓటు వేసి అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. ఒక్కో ఓటరు ముగ్గురికి ఓటు వేయవచ్చు. 50% ఓట్లు దక్కించుకున్న అభ్యర్థి విజయం సాధిస్తారు. శ్రీలంక అధ్యక్ష పదవి కోసం 38 మంది పోటీ పడుతున్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, అనుర కుమార దిస్సనాయకే, సజిత్ ప్రేమదాస మధ్యనే నెలకొన్నది.

హైకోర్టు జడ్జి వ్యాఖ్యలపై
సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేదవ్యాసచార్ శ్రీషానంద గురువారం ఓ కేసు విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన రెండు వీడియోలపై స్పందించింది. ఓ వీడియోలో శ్రీషానంద ఓ మహిళా న్యాయవాదిని మందలిస్తున్నట్లు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు వినిపించింది. మరొక వీడియోలో, ఆ జడ్జి బెంగళూరులోని ముస్లిం మెజారిటీ ప్రాంతాన్ని పాకిస్థాన్‌గా అభివర్ణించినట్లు కనిపించింది. సీనియర్ అడ్వకేట్ ఇందిరా జైసింగ్ ఎక్స్ వేదికగా సీజేఐ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లారు. దీంతో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జిల ధర్మాసనం శుక్రవారం ఉదయం సమావేశమైంది. రెండు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కర్ణాటక హైకోర్టును ఆదేశించింది. వచ్చే బుధవారం దీనిపై విచారణ జరపనున్నట్లు తెలిపింది. ఇటువంటి విషయాలపై మార్గదర్శకాలను జారీ చేస్తామని చెప్పింది.

కొలీజియం.. సెర్చ్ కమిటీ కాదు

కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: న్యాయమూర్తుల నియామకం కోసం సిఫారసు చేసే కొలీజియం అంటే సెర్చ్ కమిటీ కాదని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం కోసం కొలీజియం పునరుద్ఘాటించిన అభ్యర్థుల పేర్లను, వారిలో కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించనివారి పేర్లను వచ్చే బుధవారం నాటికి సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కొలీజియం తన నిర్ణయాన్ని పునరుద్ఘాటించినపుడు, దానిని కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం సంప్రదాయమని తెలిపింది. కొలీజియంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియర్ మోస్ట్ జడ్జిలు ఉంటారు. కొలీజియం పునరుద్ఘాటించిన పేర్లను ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, నిర్ణీత వ్యవధిలోగా కొలీజియం సిఫారసులను ఆమోదించకపోతే, ఆ వ్యవధి తర్వాత ఆ సిఫారసుకు ఆమోదం లభించినట్లుగానే పరిగణించే నిబంధన ఉండాలన్నారు. అడ్వకేట్ హరీశ్ విభోర్ సింఘాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. జార్ఖండ్ ప్రభుత్వం దాఖలు చేసిన మరొక పిటిషన్‌లో తమ రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎంఎస్ రామచంద్ర రావును నియమించాలని కొలీజియం సిఫారసు చేసిందని, దానిని ఆమోదించనందుకు కేంద్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కార చర్యలు చేపట్టాలని కోరింది. జార్ఖండ్ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ మాట్లాడుతూ, ఒరిస్సా హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ బీఆర్ సారంగిని జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం చాలా ముందుగానే సిఫారసు చేసిందని, కానీ కేంద్ర ప్రభుత్వం ఆయన పదవీ విరమణకు 15 రోజుల ముందు మాత్రమే ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇది చాలా తప్పు అని వ్యాఖ్యానించారు.

ఆఖరి నిమిషంలో పరీక్ష పద్ధతిలో మార్పులా?

ఆఖరి నిమిషంలో నీట్-పీజీ 2024 పరీక్ష ప్యాటర్న్‌ను మార్పు చేయడానికి కారణమేమిటని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఎన్‌బీఈ)ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇది అసాధారణ విషయమని, దీని కారణంగా విద్యార్థులు పరీక్షలో వైఫల్యం చెందే అవకాశం ఉందని పేర్కొంది. విద్యార్థుల తరపున న్యాయవాదులు విభా దత్త మహిజ, తన్వీ దుబే దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. దీనిపై వారంలోగా సమాధానం ఇవ్వాలని ఎన్‌బీఈ, కేంద్రాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఆగస్టు 11న జరిగిన నీట్-పీజీ పరీక్షల్లో పరీక్షా విధానం, మార్కుల నార్మలైజేషన్ తదితరమైనవి ఆఖరి నిమిషంలో మార్పులు చేశారని, దీని కారణంగా తాము ఇబ్బందులు ఎదుర్కొన్నామని పిటిషనర్లు ఆరోపించారు.

ఆర్మీ అధికారికి కాబోయే భార్యపై
పోలీసుల లైంగిక వేధింపులు

- కాళ్లూ చేతులు కట్టేసి, బట్టలిప్పి చితకబాదిన వైనం
- ఒడిశా పోలీస్ స్టేషన్‌లో దారుణం

భువనేశ్వర్: బీజేపీ పాలిత ఒడిశాలో దారుణం చోటుచేసుకుంది. పోకిరీల నుంచి కాపాడమంటూ ఆర్మీ అధికారి అయిన కాబోయే భర్తతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయబోయిన ఒక మహిళా న్యాయవాది పట్ల పోలీసులు కర్కశంగా ప్రవర్తించారు. ఆమెను జుట్టుపట్టుకుని కొట్టి, కాళ్లూ, చేతులు కట్టేసి దారుణంగా హింసించడమే కాక, ఆమె బట్టలను ఊడదీసి లైంగికంగా వేధించారు. తర్వాత ఆమెపై తప్పుడు కేసు బనాయించి జైలుకు పంపారు. ఈ ఘటన ఈ నెల 15న జరుగగా, రిమాండ్ నుంచి విడుదలైన బాధితురాలి ఫిర్యాదుతో ఈ అమానుష కాండ వెలుగుచూసింది.

అసలేం జరిగింది?

రెస్టారెంట్ యజమాని, మహిళా న్యాయవాది అయిన 32 ఏండ్ల మహిళ ఆర్మీ కెప్టెన్, కాబోయే భర్తతో ఈ నెల 15న రెస్టారెంట్ మూసి బయటకు వస్తుండగా, కొందరు పోకిరీలు వేధించారు. దీంతో వారు వెంటనే భరత్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇవ్వడానికి ప్రయత్నించారు. అక్కడ సివిల్ దుస్తుల్లో ఉన్న ఒక మహిళా కానిస్టేబుల్ వారితో అనుచితంగా ప్రవర్తించింది. ఆర్మీ అధికారిని పోలీసులు అకారణంగా బంధించారు. ఇదేమని ప్రశ్నించిన ఆ మహిళను కొట్టడం ప్రారంభించారు. ఆమె కాళ్లు, చేతులు కట్టేయడానికి ప్రయత్నించారు. దీంతో ప్రతిఘటించిన ఆమె ఆత్మరక్షణకు కానిస్టేబుల్ చేతిని కొరికింది. దాంతో ఆమెను బంధించి లాకప్‌లో పడేశారు. మర్నాడు ఉదయం స్టేషన్‌కు వచ్చిన ఇన్‌స్పెక్టర్ ఆమె ఛాతిపై, శరీరంపై తన్నడం ప్రారంభించాడు. చాలా సేపు అమెను కొట్టి, ఆమె ప్యాంట్‌ను ఊడదీశాడు. తర్వాత తన ప్యాంట్ కూడా కిందకు లాగి అతని ప్రైవేట్ పార్టును చూపిస్తూ ఎంతసేపు నీవు మౌనంగా ఉండగలవు అంటూ దూషించాడు. తర్వాత మహిళా కానిస్టేబుల్‌ను కొట్టిందని ఆమెపై తప్పుడు కేసు నమోదు చేసి కోర్టుకు పంపడంతో రిమాండ్ విధించారు. తర్వాత ఆమెకు బెయిల్ రావడంతో పోలీస్ స్టేషన్‌లో తనపై జరిగిన దారుణంపై ఫిర్యాదు చేసింది. బాధ్యులైన పోలీసులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

సీబీఐకి సుప్రీం మొట్టికాయలు

కోర్టులపై నిందలా?

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: కోర్టులపై నిందారోపణలు చేసినందుకు సీబీఐకి శుక్రవారం సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. బెంగాల్‌లో 2021 ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్ల కేసులను రాష్ట్రం వెలుపల విచారణ జరిపించాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్‌లు ఎస్ ఓకా, పంకజ్ మిథల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. 'మీరు ఏ ఉద్దేశంతో కేసును దాఖలు చేశారు. యావత్ న్యాయ వ్యవస్థపై ఎందుకు నిందలు వేస్తున్నారు? మీ అధికారులకు అక్కడ ఉన్న న్యాయాధికారో, లేదా ఆ రాష్ట్రమో నచ్చకపోవచ్చు. అంతేకానీ యావత్ న్యాయవ్యవస్థ పనిచేయడం లేదని అనవద్దు. దీనిపై జడ్జీలు, జిల్లా జడ్జీలు, సివిల్ జడ్జీలు ఇక్కడకు వచ్చి తమను సమర్థించుకోలేరు' అంటూ సీబీఐ తరపున హాజరైన అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజును ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో కేసు బదిలీ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు ఆయన ధర్మాసనానికి తెలిపారు.



అమెరికాకు చెందిన కంప్యూటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ విద్యార్థిని ధ్రువి పటేల్‌ను మిస్ ఇండియా వరల్డ్ వైడ్-2024 విజేతగా ప్రకటించారు.'మిస్ ఇండియా వరల్డ్ వైడ్‌గా గెలుపొందడం అద్భుతమైన గౌరవం. ఇది కిరీటం కంటే ఎక్కువ. ఇది నా వారసత్వాన్ని, విలువలను ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఇతరులకు స్ఫూర్తిని ఇచ్చేందుకు అవకాశం' అని న్యూజెర్సీలోని ఎడిసన్‌లో కిరీట ధారణ జరిగాక ధ్రువి అన్నారు. మిసెస్(శ్రీమతి) ఇండియా వరల్డ్ వైడ్ కిరీటాన్ని ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన సుయెన్ మౌటెట్ కైవసం చేసుకున్నారు. కిశోర బాలికల(టీన్) విభాగంలో గ్వాడెలోప్(ఫ్రాన్స్‌కు చెందిన ద్వీపం)కు చెందిన సియెర్రా సూరెత్ మొదటి స్థానంలో నిలిచారు.

శ్రీవారి లడ్డూ కల్తీపై నివేదికివ్వండి

ఏపీ సర్కారును కోరిన కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిన కల్తీ నెయ్యి వాడినట్టు వచ్చిన ఆరోపణలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీ సర్కారును కేంద్ర మంత్రి నడ్డా కోరారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుతో తాను మాట్లాడానని, వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపాలని కోరానన్నారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు, ఈ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు అవసరమని, దోషులకు తగిన శిక్ష పడాల్సిందేనని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. కల్తీ నెయ్యి ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ డిమాండ్ చేశారు. ఇది కేవలం కుంభకోణమే కాదని, హిందూయిజం నాశనానికి జరిపిన కుట్రగా ఆయన అభివర్ణించారు.

క్షమించరాని నేరం

: అయోధ్య ఆలయ ప్రధాన అర్చకులు

తిరుమల నెయ్యి కల్తీపై అయోధ్య ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఒక వేళ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలవడం నిజమైతే అది క్షమించరాని నేరం. దానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని ఆయన డిమాండ్ చేశారు. 'వైష్ణవులు, కొందరు భక్తులు కనీసం వెల్లుల్లి, ఉల్లి పాయ కూడా ముట్టరు. అలాంటి పరిస్థితుల్లో నెయ్యిలో కొవ్వు కలిపారనడం నిజంగా దురదృష్టకరం. ఇది హిందువుల విశ్వాసాలను ఎగతాళి చేయడమే' అని అన్నారు.

సుప్రీంకోర్టులో పిటిషన్

తిరుమల కల్తీ నెయ్యి వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. తిరుమల లడ్డూ కల్తీతో హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకుని హిందువుల మతపరమైన హక్కులను కాపాడాలని సత్యం సింగ్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు.

చిబ్రుగఢ్ చెక్‌పోస్ట్‌ను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం గురువారం మూసేయడంతో ఎన్‌హెచ్-19పై బారాకర్ వంతెన నుంచి మైథోన్ వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. జార్ఖండ్‌ను కాపాడుకోవడం కోసం దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ దాని రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నదని, ఫలితంగా తమ రాష్ట్రంలో వరదల ముప్పు ఏర్పడిందని మమత ఆగ్రహం వ్యక్తం చేశారు.

'స్టార్ హెల్త్'పై హ్యాకర్ల పంజా

న్యూఢిల్లీ: దిగ్గజ ఆరోగ్య బీమా సంస్థల్లో ఒకటైన 'స్టార్ హెల్త్'పై హ్యాకర్లు పంజా విసిరారు. ఆ కంపెనీకి చెందిన 3.1 కోట్ల మందికిపైగా కస్టమర్ల డాటాను తస్కరించారు. కస్టమర్ల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, మెడికల్ రిపోర్టులు, ఇతర వ్యక్తిగత వివరాలతో కూడిన ఆ సున్నిత సమాచారాన్ని ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ